

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శుక్రవారం,22 ఆగస్టు 2025

8 పేజీలు

## భారీగా పెరిగిన

# గోదావరి నీటిమట్టం

- రెండో ప్రమాద హెచ్చరిక జారీ - నీటమునిగిన కడమ్మ స్లూయిజ్ గేట్లు
- పోలవరం ప్రాజెక్టు నుండి దిగువకు నీరు విడుదల



**పోలవరం,మేజర్‌న్యూస్ :** అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో ఎగువ రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలకు గోదావరిఉపనదులు కడెం,మంజీర, హరిద్ర, ఇంద్రావతి, మానేరు ప్రాణహిత, కిన్నెరసాని శబరి,సీలేరు ఉపనదులు, మార్గ మధ్యంలో కొండవాగులు పొంగిగోదావరిలో కలుస్తుండడంతో గురువారం సాయంత్రానికి గోదావరిలో నీటిమట్టం అనూహ్యరీతిలో పెరిగింది. సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 51.80 అడుగులకు చేరుకోవడంతో అధికారులు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,95,616 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 33.100 మీటర్లు స్పిల్వే దిగువన 24.630మీటర్లునీటిమట్టం నమోదయ్యింది. వరద జలాలు నీటిమట్టం

- తరువాయి 2లో..

## గోదావరి వరదతో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వరద ప్రాంతాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్,జేసి
- చిగురుమామిడిలో బాధితుల సమస్యలు తెలుసుకున్న కలెక్టర్





**వేలేరుపాడు,మేజర్‌న్యూస్ :** వేలేరుపాడు వరద ప్రభావిత ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి గురువారం పరిశీలించారు. వేలేరుపాడు మండలం చిగురు మామిడి సందర్శించి వరద ప్రభావిత బాధితుల సమస్యలనుకలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గోదావరి వరద నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.చేపలు పట్టేవారు, రైతులు,పశువుల కాపరులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రస్తుతం గోదావరివరదనీటిమట్టం 51.90 అడుగులుగా భద్రాచలం వద్ద నమోదయిందని కలెక్టర్ చెప్పారు. ఈ వరద నీరు ఏలూరు జిల్లా సరిహద్దుల్లోకి రావడానికి 24 గంటల సమయయం తీసుకుంటుందున్నారు. వరద తీవ్రత దృష్ట్యా వేలేరుపాడు కుకునూరు మండలాల్లో సహాయక చర్యలను ముమ్మరంచేశామనిచెప్పారు.వేలేరుపాడు మండలంలో 23 నివాసిత ప్రాంతాలున్నాయని, అన్ని నివాసిత ప్రాంతాల్లో గ్రామాలు బైట ప్రపంచానికి సంబంధాలు తెగిపోయి వున్నాయన్నారు. అయినప్పటికీ అక్కడి వారికి అవసరమైన

- తరువాయి 2లో..

## యువ ఆస్ట్రోనాట్ జాహ్నవి భవిష్యత్తుకు కేంద్రం సహకారం

- కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హామీ



**ఢిల్లీ/భీమవరం,మేజర్‌న్యూస్ :** అమెరికాలోని ప్రైవేట్ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ (టిఎస్ఐ) 2029లో నిర్వహించే అంతరిక్ష యాత్రకు ఆస్ట్రోనాట్ కాండిడేట్ (ఎఎస్‌సిఎఎన్) ఎంపికైన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన 23 సంవత్సరాల యువతి జాహ్నవి దంగేటి గురువారం ఢిల్లీలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఆయన కార్యాలయంలో మర్యాద

- తరువాయి 2లో..

## కొండలరావుపాలెంలో ఉద్రిక్తత - భారీగా మోహరించిన పోలీసులు

- 144 సెక్షన్ ఉన్నా వైసిపి నేతల కొల్లేరు గ్రామస్తుల మధ్య మాటల యుద్ధం
- మాజీ ఎమ్మెల్యే కొఠారు నివాసానికి చేరుకున్న పత్తి కోళ్ల లంక, శ్రీపరు గ్రామస్తులు







**పెదవేగి,మేజర్‌న్యూస్:** పెదవేగి మండలం కొండలరావుపాలెంలో గురువారం మరోసారి ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. క్షణం క్షణం భయం భయంగా గ్రామంలో హై టెన్షన్ నెలకొని ఉంది. 2019 - 24 మధ్య చేపల చెరువులకు సంబంధించిన సొమ్ము చెల్లించకుండా దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మమ్మల్ని మోసం చేశాడని పేర్కొంటూ ఏలూరు రూరల్ మండలం పత్తికోళ్లలంక, శ్రీపర్రు గ్రామాలకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో గురువారం కొండలరావు

- తరువాయి 2లో..

## వరద నేపథ్యంలో పంటు నిలుపుదల

- తూర్పు,పశ్చిమగోదావరి జిల్లాలలకు రాకపోకలు బంద్



**నరసాపురం,మేజర్‌న్యూస్:** గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో తూర్పు ,పశ్చిమగోదావరి జిల్లాలలకు మాధవాయిపాలెం పెర్రినుండి రాకపోకలు నిలుపుదల చేసినట్లు ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. ధవలేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

- తరువాయి 2లో..

## దివ్యాంగుల ఉసురు మూట కట్టుకోవద్దు



- వాళ్లు ఏ పాపం చేశారు?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జిల్లా వైసీపీ అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు

**కైకలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దివ్యాంగుల పెన్షన్లను సవరిస్తూ అర్హులైన వికలాంగులకు పెన్షన్లు తొలగించడంపై కైకలూరులోని ఏలూరురోడ్‌లోగల కార్యాలయంలో పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో సుమారుగా 4,736మంది దివ్యాంగులకు, రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా1 లక్షా ,25 వేల మంది దివ్యాంగులకు పెన్షన్లను తొలగించారని, దివ్యాంగులు, చిన్నపిల్లలు దేవుడితో సమానమని,పెన్షనే వారికి జీవనాధారం అని,అన్నారు.

- తరువాయి 2లో..

# కొండలరావుపాలెంలో ఉద్రిక్తత - భారీగా మోహరించిన పోలీసులు

**మొదటిపేజి తరువాయి**

పాలెంలోని అబ్బయ్య చౌదరి ఇంటిదగ్గరకు చేరుకున్నారు. అయితే లంక గ్రామస్తులు అబ్బయ్య చౌదరి ఇంటికి వస్తున్నారని తెలుసుకున్న వైసీపీ శ్రేణులు ఆయన నివాసం దగ్గరకు భారీగా తరలివచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం సాగింది. లంకవాసులు మాజీ ఎమ్మెల్యే ఇంటిని చుట్టుముట్టడానికి వస్తున్నారని సమాచారం బుధవారం రాత్రి అందుకున్న పోలీసులు గురువారం ఉదయానికి భారీ సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరు కూడా ఎటువంటి సమావేశాలు, సభలు నిర్వహించడం, బృందాలుగా సంచరించడం గాని చేయవద్దని నూజివీడు డిఎస్పి వైవివిఎస్వి.ప్రసాద్ బుధవారం రాత్రి హెచ్చరికలు జారీ చేశారు. గ్రామంలో శాంతిభద్రతలకు విగాథం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని కూడా పోలీసులు హెచ్చరించారు. అయినప్పటికీ పోలీసులు ఆదేశాలు బేఖాతరు చేస్తూ అటు వైసిపి వర్గీయులు ఇటు లంకల వాసులు భారీగా ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల ఆదేశాలను పట్టించుకోకుండా ఇరువు వర్గీయులు ఒకరిపై ఒకరు దూషణలు కొనసాగించారు. మాకు ఇవ్వాల్సిన చేపల చెరువుల బకాయి ఇచ్చేస్తే తిరిగి వెళ్ళిపోతామని లంకవాసులు పేర్కొంటుండగా, మీకు సొమ్ము ఇవ్వాల్సి ఉంటే దానికి సంబంధించిన ఆధారాలు తీసుకువస్తే ఆ సొమ్ము ఇప్పిస్తామని వైసిపి వర్గీయులు ఎదురుదాడికి దిగారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో పోలీసులు ఆలోచనలో పడిపోయారు. చేపల చెరువుల కౌలు సొమ్ము ఐదేళ్ల కు సంబంధించి రూ. 8 కోట్లకు పైగా సొమ్ము బకాయి ఉందని పేర్కొంటూ లంకల గ్రామస్తులు పది నెలలుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే విదేశాల నుంచి రావడంతో మరోసారి బకాయి సొమ్ము వివాదం తెరపైకి వచ్చింది. బకాయి సొమ్ము ఇచ్చేంతవరకు అబ్బయ్య చౌదరి నివాసాన్ని వీడేది లేదని పేర్కొంటూ లంకల గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. బకాయి సొమ్ము ఇచ్చేంతవరకు అబ్బయ్య చౌదరి కి చెందిన పొలాల్లో పంట ఉత్పత్తులను తీసుకొని లంకల గ్రామస్తులు పంట కోయనీయకుండా అడ్డుపడుతూనే వచ్చారు. అయితే గురువారం ఉదయం అబ్బయ్యచౌదరి వర్గీయులు పామాయిల్ గెలలను నరికి తరలించారు. విషయం తెలుసుకున్న లంకల గ్రామస్తులు వాటిని అడ్డుకోవడానికి భారీగా తరలివచ్చారు. అప్పటికే పామాయిల్ గెలలు తరలించడంతో లంకల గ్రామస్తులు, ఆయన ఇంటి వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

# భారీగా పెరిగిన గోదావరి నీటిమట్టం

**మొదటిపేజి తరువాయి**

పెరగడంతో పట్టిసీమ శివక్షేత్రంచుట్టూ ఉన్న ఇసుకతిన్నెలునీట మునిగాయి. గోదావరి నీటిమట్టం పెరగడంతో కడమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునిగాయి,దీంతో ఏటిగట్టుకి కుడివైపున కడమ్మ కాలువ జలాలు, కొండవాగుల జలాలు గోదావరిలోకి వెళ్ళేమార్గం లేక పంటపొలాలు నీటమునిగాయి. కొవ్వాడకాలువ, జిల్లెల్లగూడెం, గుంజవరం కొండవాగులు, కాలువల జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుండి గోదావరిలోకి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

# వరద నేపథ్యంలో పంటు నిలుపుదల

**మొదటిపేజి తరువాయి**

జారీచేయడంతో జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు పంటు ద్వారా రాకపోకలు గురువారం ఉదయం నుండి నిలుపుదల చేశామన్నారు. వరద ఉధృతి తగ్గిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పునరుద్ధరిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఇదిలా ఉండగా ఆర్డీవో దాసిరాజు ఆదేశాల మేరకు తాసిల్దార్ ఐవివి సత్యనారాయణ మాధవాయపాలెం పెర్రిని పరిశీలించారు. ఈ రేవు నుండి నాటు పడవలు లేక ఇతర మార్గాల ద్వారా రాకపోకలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి తగ్గేవరకు చించినాడ బ్రిడ్జి మీదుగా ప్రయాణాలు కొనసాగించాలని ప్రజలను కోరారు. చించినాడ బ్రిడ్జికి మరమ్మత్తులు జరుగుతున్నప్పటికీ పంటురాకపోకల నిలిపివేసిన నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జిద్వారాప్రయాణించేందుకు ఉన్నతా ధికారుల అనుమతి ఇచ్చారని తాసిల్దార్ సత్యనారాయణ తెలిపారు.

## వీరవాసరంలో వయోవృద్ధుల సమస్యలపై గళం






**వీరవాసరం,మేజర్ న్యూస్:** వీరవాసరంలో సీనియర్ సిటిజన్స్ డే వేడుకలు గురువారం గుండా వారి వీధిలోని పాత స్నేహలత పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్, కాపు వనిత క్లబ్, వీరవాసరం కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా చర్చకు వచ్చాయి. ఆరోగ్య సదుపాయాల లోపం, పెన్షన్లలో ఆలస్యం, కుటుంబాల నిర్లక్ష్యం వంటి సమస్యలు వృద్ధులను కృంగదీస్తున్నాయని నాయకులు స్పష్టం చేశారు. వృద్ధులు మానసికంగా ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారని, వారికి ఆత్మగౌరవం కలిగించేలా కుటుంబ సభ్యులు మద్దతుగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన వృద్ధులను సన్మానించి, వారి జీవిత అనుభవాలను పంచుకునే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో కావు సర్వీస్ క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, కాపు వనిత క్లబ్ అధ్యక్షురాలు డా. బి. లక్ష్మీకళ్యాణి,వీరవాసరం కళాపరిషత్ సెక్రటరీ పాలా ఆంజనేయులు, మహిళా ప్రతినిధి కామిశెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపాల స్వామి ఆలయ కమిటీ నియామకం



నరసాపురం, మేజర్న్యూస్: పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ రాజగోపాల స్వామి గుడి చైర్మన్గా రామవరపు శ్రీరామ్ నియమితు లయ్యారు. ఆయనతో పాటు డైరెక్టర్లను నియమించారు. గురువారం ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నాయకర్ శు భాకాంక్షలు తెలియజేశారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి
## - రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్




**ఏలూరు,మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు ఏరియా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం ఆర్.ఆర్. పేట, స్ఫూర్తి భవన్ లో గల ఏరియా కార్యాలయం నందు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి హాజరైన డేగా ప్రభాకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర 28వ మహాసభలు ఒంగోలు నగరంలో జరుగుచున్నాయని తెలిపారు. మహాసభలలో భాగంగా ఆగస్టు 23వ తేదీ మధ్యాహ్నం వేలాది మందితో ప్రజా ప్రదర్శన ప్రదర్శన,బహిరంగ సభ జరుగుతాయని ఈ కార్యక్రమంలో ఏలూరు నగరం నుండి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో శుక్రవారం ఉదయం హనుమాన్ నగర్ నందు జనసేవాదళ్ క్యాంపు నిర్వహిస్తున్నామని ఈ క్యాంపును రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రారంభిస్తారని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందే వాలంటీర్స్ ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలలో భాగంగా జరిగే రెడ్ షర్ట్ వాలంటీర్ కవాతులో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల నాగ దుర్గా వర ప్రసాద్, గొర్లి స్వాతి, శాయన అభిలాష్ కుమార్, కొండేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## విమాన గోపుర స్వర్ణమయ పథకానికి రూ.5లక్షల విరాళం



**ద్వారకా తిరుమల, మేజర్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్ర మైన చిన్న వెంకన్న ఆలయానికి భీమవరం వాస్తవ్యు లు కె పెద్దిరాజు విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ఆఫీసు వద్ద విమాన గోపుర స్వర్ణమయ పథకానికి 5లక్షల విరాళం ఐసిఐ బ్యాంకు చెక్కు రూపేణా అందించారు. దేవాలయ ఏఈఓ నటరాజరావు బాండ్ పత్రాలను, స్వామివారి ప్రసాదాలను, అందించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# గోదావరి వరదతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మొదటిపేజి తరువాయి**

నిత్యావసరాలు, ఇతర అవసరాలను అధికార యంత్రాంగం కల్పిస్తుందన్నారు. వరద బాధిత గ్రామాల ప్రజలు వారికి కూరగాయలు కావాలని అడిగారన్నారు. వాటిని శుక్రవారం నాటికి అందజేస్తామన్నారు. బాధిత ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాన్ని కుకునూరులోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసి, 150 కుటుంబాలను తరలించామన్నారు. వారికి అన్ని అవసరమైన నిత్యాసరాలు తదితరాలను ఏర్పాటు చేశామన్నారు. వరద పరిస్థితి తీవ్రంగా ఉన్నందున ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. సంబంధాలు తెగిపోయిన గ్రామాలకు సంబంధించి తాగునీటిని రేపటి నుండి టాంకర్ల ద్వారా అందచేస్తామన్నారు. అలాగే మోటార్లుకూడాపంపుతామని చెప్పారు .ప్రాధమిక చికిత్సకు అవసరమైన మందులను కూడా అందచేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో పీహెచ్సీల నుండి వైద్యాధికారులను అందుబాటులో వుంచామన్నారు. కుకునూరు మండలంలో వరద ముంపు గ్రామాలైన కొమ్ముగూడెం, లచ్చుగూడెం ప్రజలను దాచారం సహాయ శిబిరానికి తరలించామన్నారు. కుక్కునూరు మండలంలో మూడు గ్రామాల్లోని ఆరు నివాసిత ప్రాంతాలు గోదావరి వరద వల్ల సంబంధాలు తెగిపోయాయన్నారు. అలాగే వేలేరుపాడులో 23 గ్రామాల్లో 13 నివాసిత ప్రాంతాలు బైట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని కలెక్టర్ వివరించారు. దీనివల్ల మొత్తం 3,690 కుటుంబాలు వరద బాధితులుగా ఉన్నాయన్నారు. ఇందులో 1,222 కుటుంబాలు కుకునూరు, 2,468 కుటుంబాలు వేలేరుపాడు మండలంలో వున్నాయన్నారు. వీరి వెంట జంగారెడ్డిగూడెం ఆర్డీవోయం.వి.రమణ డీఎస్పీ వెంకటేశ్వం రావు,ఫిషరీస్ డిడి నరసయ్య, ఎంపీడీవో శ్రీహరి తదితరులు ఉన్నారు.

# యువ ఆస్ట్రోనాట్ జాహ్నవి భవిష్యత్తుకు కేంద్రం సహకారం

**మొదటిపేజి తరువాయి**

పూర్వకంగా కలిశారు. 2022లో పోలాండ్లోని క్రాకోవ్లో ఉన్న అనలాగ్ ఆస్ట్రోనాట్ ట్రైనింగ్ సెంటర్ (ఎఎటిసి)లో చిన్న వయసులోనే విదేశీ అనలాగ్ ఆస్ట్రోనాట్గా, మొదటి భారతీయ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. జాతీయ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను కలిసిన జాహ్నవి, తన భవిష్యత్తు ప్రణాళికలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించి ప్రతిభ, కృషిని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అభినందించారు. జాహ్నవి లాంటి యువత భారతదేశానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. జాహ్నవి డాంగేటి దేశానికి మరింత పేరు తీసుకొచ్చేందుకు అన్ని విధాలా ఆమె శిక్షణ,భవిష్యత్ అంతరిక్ష పరిశోధన కార్యక్రమాలకు అవసరమైన పూర్తి సహకారం వ్యక్తిగతంగానూ, కేంద్ర ప్రభుత్వం తరపున అందిస్తాం అని ఆమెకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ కేంద్రమంత్రి వర్మ ఇచ్చిన హామీ తనకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని, తన లక్ష్య సాధనకు మరింత స్ఫూర్తినిస్తుందని చెప్పారు. జాహ్నవి ఎంపిక యువతకు, ముఖ్యంగా మహిళలకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని, ఇది దేశంలో అంతరిక్ష పరిశోధనల పట్ల మరింత ఆసక్తిని పెంచుతుందని శ్రీనివాస వర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

## దివ్యాంగుల ఉసురు మూట కట్టుకోవద్దు

**మొదటిపేజి తరువాయి**

10 సంవత్సరాలుగా 80నుండి -85శాతం ఉన్న వైకల్యం ఇప్పుడు 20 నుండి -25శాతానికి నికి ఎలా? తగ్గుతుందని ప్రశ్నించారు. పెన్షన్లను తొలగించి మళ్లీ అర్జీలు పెట్టుకోండి అని చెప్పడం చోద్యంగా ఉందని, వికలాంగులను అధికారుల చుట్టూ తిప్పుతూ వారిని ఇబ్బంది పెట్టడం అమానుషమని,ప్రతి నియోజక వర్గంలోనూ ఎమ్మెల్యేలు అర్హులై నోటీసులు అందుకున్న వికలాంగులకు తోడుగా నిలిచి వారిని ఆదుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. దుర్మార్గమైన ఆలోచనలు చేసి పైశాచిక ఆనందం పొందుతూ సంక్షేమ పథకాలకు కోత పెడుతున్నారని, దివ్యాంగులు ఏమి పాపం చేశారని? దూలం నాగేశ్వరావు ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే సంపద సృష్టించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన ప్రతి హామీలకు కోతలు విధిస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేయటం కాదా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, ముదినేపల్లి మండల పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి సత్యనారాయణ,మండవల్లి మండలం ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్(రాము), కలిదిండి మండలంఎంపీపీచందన ఉమామహేశ్వర రావు(ఉమా) రాష్ట్ర మేధావుల విభాగ కార్యదర్శి బుసనబోయిన వెంకటేశ్వరరావు, (బివిరావు) సింగంశెట్టి రాంబాబు,తిరుమని రమేష, బోయిన రామరాజు, పంజా రామారావు, తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడి చిత్తడి

# గ్రావెల్ రోడ్డు నిర్మించాలని ఆక్వా రైతుల ఆవేదన





**కైకలూరు, మేజర్‌న్యూస్ :** చినుకు పడితే చిత్తడిగా మారుతున్న కాలువ గట్టుపై పదే పదే ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఆక్వా రంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. అందులోనూ కైకలూరు నియోజకవర్గం ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. ఆక్వా ఉత్పత్తుల ద్వారా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందుతున్న స్థానిక ఆక్వా రైతులకు మౌలిక సౌకర్య కల్పన కలగానే మిగులు తోంది. కైకలూరు మండలం శ్యామలంబాపురం నుండి మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం వరకు పోల్రాజ్ పంట కాలవ గట్టు సమీపాన వెయ్యి ఎకరాల ఆయకట్టులో చేపలు, రొయ్యల సాగు జరుగుతుంది.

ఈ రహదారిలో ఆక్వా రైతులు ఉత్పత్తుల రవాణాకు ఆపసోపాలు పడుతున్నారు. చేపల చెరువుల వద్దకు వెళ్లాలంటే రహదారి మార్గం సక్రమంగా లేదని రహదారి మార్గాన్ని గ్రావెల్ రోడ్డుగా ఏర్పాటు చేయాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు ఈ సమస్యపై నాయకుల వద్ద మొరపెట్టుకున్న అటువైపు కన్నెత్తి చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నాయకులైన ఆక్వా రైతుల సమస్యను పట్టించుకోని రహదారిని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. రైల్వే గేట్లు బాధ తప్పించుకోవడానికి ఇది సరైన మార్గమని రైతులు తెలిపారు. విజయవాడ నుండి నరసాపురం వెళ్లే రైలు మార్గంలో ఇటీవల డబల్ ట్రాక్ వేసిన తరువాత దాదాపు రోజుకి 77 గూడ్స్ రైలు ప్రయాణిస్తున్నాయి. వీటివల్ల ఒక్కో రైల్వే క్రాసింగ్ గేటు వద్ద అరగంటపైనే సమయం పోతుంది అని ఈ నేపథ్యంలో శ్యామలంబపురం నుండి మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం మీదుగా జాతీయ రహదారి పైకి ఆక్వా ఉత్పత్తి రవాణా వాహనాలు వెళ్లే అవకాశం ఉందని, మరొక మార్గం శ్యామలంబాపురం పోల్రాజ్ పంట కాలవ గట్టు నుండి రుద్రవరం వరకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేస్తే ప్రతినిత్యం వివిధ పనులు పై వెళ్లే వాహనదారులకు ఆక్వా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు నాయకులు దృష్టి సారించి పోల్రాజ్ పంట కాలగొట్టుపై గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 108 అంబులెన్సు వాహనానికి తగిన వసతి కల్పించాలి



**పెనుమత్ర, మేజర్ న్యూస్ :**మండలంలో 17 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న 108 అంబులెన్సు వాహనానికి తగినవసతి కల్పించాలని మండల అంబులెన్సు ఈ.ఎం.టి.సి.హెచ్. బాలకృష్ణ, వి. కృష్ణ, పైలెట్ లు కె.మహేష్, డి.బ్రాహ్మజీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పెనుమంత్ర మండలానికి 108 అంబులెన్స్ ను 2008 సంవత్సరం అక్టోబర్-15 కేటాయించారని, అప్పటి నుండి ఇప్పటివరకు నిరంతరా యంగా మండలంలో రేయనక పగలనక వాహనం ద్వారా తాము సేవలు అందిస్తున్నామని అన్నారు.ఎక్కడ ఏ ప్రమాదాలు సంభవించిన సకాలంలో బాధితుల చెంతకు చేరుకుని, ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన చికిత్స కొరకు సమీప ప్రభుత్వం, ప్రైవేట్ ఆసుపత్రులకు కొన్ని వందలు మందిని సకాలంలో చేర్చి వారి ప్రాణాలు కాపాడడంలో భాగస్వాముల అవుతున్నామని వారుపేర్కొన్నారు.అయితే, వాహనం, సిబ్బంది ఉండడానికి సరైన వసతి గాని, అంబులెన్స్‌కి సెంటర్ గాని లేకపోవడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 108కు ఇరిగేషన్ శాఖకు సంబంధిం చిన పాత బిల్డింగ్‌లో తాత్కాలికంగా వసతి కల్పించారని, అయితే ఇప్పుడు ఆ జాగా వదిలి, పాత పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లోనికి వెళ్ళమంటున్నారని వారు వాపోయారు. చాలా కాలంగా ఆ బిల్డింగ్ స్లాబ్ లీక్ అయ్యి ప్రమాద స్థితిలో ఉన్నందున, ఇటీవల పోలీస్ స్టేషన్‌ను మండల పరిషత్ సమావేశ మందిరంలోని మార్చారని, అలాంటి ప్రమాద స్థితిలో ఉన్న బిల్డింగ్‌లోకి, ప్రమాద బారిన పడే వాళ్ళని వెళ్ళమనడం ఎంతవరకు సబబో ఆలోచిం చాలని వారు కోరారు.మా యందు దయవుంచి మానవతా దృక్పథంతో ఈ మండలంలో ధాత్రుత్వం కలిగిన వారు మండల పరిషత్ ప్రాంగణ ంలో శాశ్వతమైన వసతి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటారని వారు విజ్ఞప్తి చేశారు.

# ష్వింగ్ స్టేటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌తో రాష్ట్రస్థాయిలో అవగాహన

## లిజిల్లాలో నైపుణ్య శిక్షణ తరగతులు

న్యాక్ ఎడి యం.వసంత రావు

నర్సాపురం,మేజర్‌న్యూస్: రాష్ట్ర స్థాయిలో ష్వింగ్ స్టేటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం నేపథ్యంలో వెస్ట్ గోదావరి జిల్లా స్థాయిలో నైపుణ్య శిక్షణ తరగతులు డిజిటల్ కమ్యూనిటీ భవన్, పీఎం లంక లో త్వరలో ప్రారంభం కానున్నాయని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (నాక్) సహాయ సంచాలకులు యం. వసంత రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం%-% నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ద్వారా, నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన ష్వింగ్ స్టేటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ తో అవగాహన ఒప్పందం కుదిరిందని ఆయన వివరించారు. ఈ ఒప్పందం ప్రకారం యన్ యస్ డి సి ఆమోదిత ఉద్యోగ పాత్రల ఆధారంగా శిక్షణా కార్యక్రమాలు, తరగతి గదులలో సిద్ధాంత బోధనతో పాటు ప్రాజెక్ట్ సైట్లలో ప్రాక్టికల్ శిక్షణ, అత్యాధునిక పరికరాలు, భద్రతా కిట్లు, రవాణా సౌకర్యం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆమేరకు అదనంగా, స్థానిక శిక్షకుల కోసం కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల ద్వారా సర్టిఫైడ్ మెషిన్ ఆపరేటర్లు, సాంకేతిక నిపుణులుగా యువతను తీర్చిద్దడం లక్ష్యమని, శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని యం. వసంత రావు తెలిపారు.'ఆంధ్రప్రదేశ్ యువతను ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో తయారు చేసి దేశీయ, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను కల్పించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. పరిశ్రమల అనుసంధానంతో ఉపాధి పెంపుతో పాటు రాష్ట్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధి కొత్త దిశలో సాగుతుందని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ సహాయ సంచాలకులు యం. వసంత రావు స్పష్టం చేశారు.



# సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండల నాగేశ్వరరావు



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ 27వ జిల్లా మహాసభలు 19,20 తారీకుల్లో తణుకులో జరిగిన సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వ రావుని జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నందుకు తాడేపల్లిగూడెం సిపిఐ పట్టణ కమిటీ, మహిళా సమైక్య ఆధ్వర్యంలో అభినందనలు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్యవర్గం లోకి తీసుకున్న సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, మరియు రాష్ట్రపార్టీ నాయకులకు అభినందనలు తెలిపారు. ఆగష్టు 23 నుండి 25 వరకు ఒంగోలులో జరిగే సిపిఐ రాష్ట్ర, మహాసభలు జరుగుతాయని 23వ తారీఖున ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని అన్నారు. ఈ మహాసభలకు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరై భవిషత్ కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు.

# అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలి

**కనీస వేతనం రూ.26 ఇవ్వాలి**

**సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి**



**పెంటపాడు, మేజర్‌న్యూస్:** అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపులో భాగంగా పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు చిర్ల పుల్లారెడ్డి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జే శ్యామలకుమారి కే కనకమాలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వ 42 రోజులు సమ్మె కాలంలో ప్రభుత్వ రాత పూర్వకంగా హామీలు ఇచ్చిందని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం జనసేన పార్టీలు సమ్మె శిబిరం వద్దకి వచ్చి మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ సమస్యలన్నీ పరిష్కరిస్తామని వాగ్దానం చేశారని లిఖితపూర్వక హామీ ఇచ్చిన గత ప్రభుత్వాన్ని ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం గానీ ఏవిధంగా వాగ్దానాలు అమలు చేయలేదని వారు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారు సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆర్ అనురాధ జి జయలక్ష్మి పి మీనా కుమారి ఈ నాగమణి జి స్నేహలత ఎం మౌనిక టీవీ లలిత ఎం రాజేశ్వరి జి వెంకటలక్ష్మి ఎం.స్వర్ణకుమారి కె.నాగమణి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తగ్గుముఖం పట్టనున్న గోదావరి ఉధృతి

**అమరావతి/ఏలూరు, సూర్య బ్యూరో:** గోదావరి నది వరద ఉధృతి భద్రాచలం వద్ద గురువారం రాత్రి నుంచి తగ్గుముఖం పడుతుందని శుక్రవారం రాత్రి నుంచి ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద వరద ప్రవాహం తగ్గే సూచనలు ఉన్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. గోదావరి, కృష్ణా నదుల వరద పూర్తిస్థాయిలో తగ్గేవరకు ఆయా నదీపరీవాహక ప్రాంత, లోతట్టు గ్రామ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వాగులు,కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. గురువారం రాత్రి 8 గంటల నాటికి భద్రాచలం వద్ద నీటిమట్టం 52.2 అడుగులు ఉందని పేర్కొన్నారు. ధవళేశ్వరం వద్ద రాత్రి 8 గంటలకు ఇన్, ఔట్ ఫ్లో 11.85 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు, దాదాపుగా రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయి వరకు వరద ప్రవాహం చేరే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. సహాయక చర్యలకు 4 ఎన్ డి ఆర్ ఎఫ్, 8 ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు జిల్లాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రభావిత జిల్లాల్లోని క్షేత్రస్థాయి అధికారులకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సహాయం, వరద ప్రవాహం సమాచారం కోసం విపత్తులో నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ 112, 1070,18004250101 నెంబర్లు సంప్రదించాలని కోరారు. మరోవైపు ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ప్రవాహం ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 5.02 లక్షల క్యూసెక్కులు ఉందని, మొదటి హెచ్చరిక కొనసాగుతుందని తెలిపారు.

# నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

**– మాజీ ఎమ్మెల్యే బండారుకు కూనపు రెడ్డి వినతి**

**నరసాపురం , మేజర్ న్యూస్:** మండలం లోని యర్రంశెట్టి వారి పాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, నరసాపురం నియోజకవర్గం రైతు సమస్యల పోరాట నాయకులు కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు గురువారం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూనపరెడ్డి మాట్లాడుతూ నరసాపురం నియోజకవర్గంలో గత హయాం నాటి భవనాలు వివిధ కార్యాలయాలకు అనుకూలంగా నిర్మించబడ్డాయని నరసాపురం ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఆయా కార్యాలయాలకు భవనాల కోసం చూడాల్సిన అవసరం లేదని అన్నారు. ఉమ్మడి జిల్లా లో ఏలూరు జిల్లా కేంద్రంగా ఉండేదని , నరసాపురం రెండోవ డివిజన్గా ఉండేదని అటువంటి జిల్లా కేంద్రాన్ని గత ప్రభుత్వం తమ తమ ప్రాంతస్వార్థ ప్రయోజనాల కోసం భీమవరాన్ని రెండవ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. ఆనాటి భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ జిల్లా రెండవ కేంద్రంగా చేస్తే నాకు మంత్రి పదవి అవసరం లేదు అని అన్నారని ఆనాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బహిరంగ సభలో తెలిపిన విషయం అందరికీ తెలుసు అన్నారు. నరసాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్ రాజు తమ సామాజిక వర్గం అధికంగా కలిగిన భీమవరం పట్టణాన్ని రెండవ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి భీమవరాన్ని రెండవ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు.ఆనాడు నరసాపురంలో ప్రజా ఉద్యమం, రాస్తారోకోలు



చేశారని అలాగే మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు కూడా ఆమరణ నిరాహార దీక్షకు దిగారని ఆయనతోపాటు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు నేతృత్వములో వివిధ రాజకీయ పార్టీలు నెలల తరబడి ఆందోళన చేపట్టినా ప్రజా ఆందోళన ను పక్కన పెట్టి భీమవరం ను జిల్లా కేంద్రంగా ప్రజాభిషానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేయడం అత్యంత దారుణమని కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగుతున్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ నాయకత్వంలో కూటమి నాయకులందరూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లాలని మాధవ నాయుడుకు అందజేసిన వినతిపత్రంలో కోరారు.

# నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

**అంగన్వాడి వర్కర్స్ ధర్నా**


**ద్వారకాతిరుమల,మేజర్న్యూస్:** అంగన్వాడీలకు పని భారాన్ని పెంచే ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ను రద్దు చేయాలని ఐసిడిఎస్ను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ద్వారకాతిరుమల మండల కమిటీ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల గ్రామంలో మానవహారం నిర్వహించి అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కోశాధికారి తులసి మరియు ప్రాజెక్టు కార్యదర్శి అనంతలక్ష్మి లు మాట్లాడుతూ ఎఫ్ ఆర్ ఎస్ యాప్ వలన లబ్ధిదారులకు అంగన్వాడీలకు తీవ్రంగా ఇబ్బందులు గురవుతున్నామని పనిచేయని ఫోన్లు ఇచ్చి అంగన్వాడీలను నరకయాతనకు గురి చేస్తున్నారని అన్ని యాప్లను కలిపి ఒక యాప్ చేస్తామని ఎప్పటినుండో చెబుతున్నారని దాన్ని ఒక యాప్ గా మార్చాలని పెరిగిన ధరలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జీతాలు పెంచుతానని 42 రోజులు సమ్మె సందర్భంగా హామీ ఇచ్చిందని ఈ ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు అంగన్వాడీల జీతాలు పెంచుతామని చెప్పారని సంవత్సరం దాటిన మాట్లాడకుండా మౌనమునిల ఉండడం భావ్యం కాదని అన్నారు. తక్షణమే



జీతాలు పెంచాలని గ్రాటివిటీ జీవోను సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు సంఘీభావంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కర రావు పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీలు పేద పిల్లలకు ఎన్నో సేవలు చేస్తున్నారని వారి కష్టాన్ని గుర్తించి వారి డిమాండ్ను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు హేమలత, సత్యప్రియ నాగలక్ష్మి సుష్మ తదితరులు నాయకత్వం వహించారు.

# కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ డేటా అప్లోడ్ని 25వ తేదీలోపు పూర్తి





**– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం,మేజర్ న్యూస్:** సెప్టెంబరు 1వ తేదీన అన్ని జిల్లాల్లో జిల్లా వాటర్ బులిటెన్లను విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలక్టర్లను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,స్వర్ణాంధ్ర ప్రదేశ్ మానిటరింగ్ డాష్ బోర్డ్, స్వామిత్వ, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటి వరకు ఈసీజన్లో మెరుగైన రీతిలో వర్షాలు పడ్డాయని రానున్న రెండు మాసాల్లో కూడా సాధారణం కంటే అధిక వర్షాలు పడతాయని అంచనా ఉందని అన్నారు.గత వారం వాటర్ బులిటెన్లకు సంబంధించి జాతీయ వాటర్ మిషన్ విడుదల చేసిన టాప్ 10 రాష్ట్రాల్లో ఎపి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈనెల 23వతేది శనివారం రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ చెప్పారు.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్కి సంబంధించిన డేటా అప్లోడ్ ని 25వ తేదీలోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించిన ఇండికేటర్స్ డేటా పారదర్శకంగా సేకరించి అప్లోడ్ చేస్తామని తెలిపారు. ఆయా శాఖల పరిధిలో సానుకూల ప్రజా దృక్పథంకు సంబంధించి మరింత పురోగతి తీసుకురావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, సిపిఓ కె.శ్రీనివాసరావు, డిపిఓ ఎం.రామనాథరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని డి.లక్ష్మి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



**ఏలూరుమేజర్ న్యూస్:** ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా అలుపెరుగని పోరాటం చేస్తున్నామనీ ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఆయన ఆయా సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకునీ, సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా తిష్టవేసిన జఠిలమైన సమస్యలకు సత్వర పరిష్కార చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇదేక్రమంలో రానున్న కాలంలో మరిన్ని ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాంటీన్ ప్రారంభం



**నర్సాపురం, మేజర్ న్యూస్ :**,ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన క్యాంటీన్ ను ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకి రామ్ లు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో, పరిశుభ్రంగా తక్కువ ధరలకు ఆహార సదుపాయం అందించడానికి ఈ క్యాంటీన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు, అలాగే సిబ్బంది అందరూ ఈ సదుపాయం నుండి లాభపడతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి నాయకులు జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సెంటర్లో అంగన్వాడీల మానవహారం



**నరసాపురం,మేజర్న్యూస్:** అంగన్వాడీల ఎఫ్ ఆర్ ఎస్ పోషణ టేకర్ రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ,గ్రాడ్యుటీ ఇవ్వాలని ,స్థానిక అంబేద్కర్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో గురువారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియుజిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోర్కెల కోసం గత ప్రభుత్వం హయంలో 42 రోజులు సమ్మె చేసిన సందర్భంలో అప్పటి ప్రతిపక్ష నాయుకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు అంగన్వాడీల సమ్మె శిబిరాలలోకి వచ్చి మా ప్రభుత్వం వస్తే మీ న్యాయమైన కోరికలను పరిష్కరిస్తామని వాగ్దానం చేశారన్నారు.కుటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన గాని అంగన్ వాడిల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టి పట్ట నట్లు వ్యవహరిస్తుందన్నారు. అంగన్వాడీలకు పని ఒత్తిడి పెంచే ఎఫ్ ఆర్ ఎస్ పోషణ ట్రాకర్స్ ను రద్దు చేయాలని 5జి బి సెల్ ఫోన్లను ఇవ్వాలని కనీస వేతనం గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జి రాజేశ్వరి, ఏ నీలిమ భవాని, రత్నకుమారి, ప్రేమ్ కుమారి,విజయ బి కృష్ణకుమారి పాల్గొన్నారు.

# నీరు చేరిన కనకాయలంక గ్రామాన్ని పరిశీలించిన జేసి





**– పడవపై ప్రయాణం – ప్రతి కుటుంబం యోగక్షేమాలు ఆరా**

**యలమంచిలి,మేజర్‌న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంకలో గోదావరి వరద తాకిడికి గురైన ప్రాంతాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదావరి వరద ఉధృతి అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో లంకవాసుల యోగక్షేమలను తెలుసుకునేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం యలమంచిలి మండలం కనకా యలంకకు పడవపై చేరుకున్నారు. గ్రామంలోని రోడ్లపైకి నీరు రావడం పరిశీలించారు.మార్గం మధ్యలో అంగన్వాడి ప్రీ స్కూల్‌లో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును పరిశీలించి, ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్నారా ? అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా, పాము,కుక్క, తేలు కాటుకు అవసంమైన అత్యవసర మందులు ఉన్నాయా, వాటిని ఎలా వినియోగించాలో శిక్షణ ఉందా అని ఆరా తీశారు. అలాగే అంగన్వాడీలో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందజేస్తున్నారా, గుడ్లను ఇస్తున్నారా అని తెలుసుకుని, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామంలో గర్భిణీ స్త్రీలు ఎంతమంది ఉన్నారు, ఎవరినైనా హాస్పిటల్లో చేర్పించారా అని అడిగి తెలుసుకున్నారు.కనకాయలంకలో నివాశితుల ఇంటింటికి వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.అందరూ ఆరోగ్యంగా ఉన్నారా, ఎవరికైనా ఆనారోగ్య సమస్యలు ఉన్నాయా, జ్వరాలతో ఎవరైనా ఇబ్బంది పడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి అంతకంతకు పెరుగుతుందని పునరావాస కేంద్రాలకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంలో లంక ప్రజలు జిల్లా జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, ప్రతి సంవత్సరం వరద సమయంలో పిల్లలు పాఠశాలలకు వెళ్ళకుండా ఇబ్బంది పడుతున్నారని, వరద ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారానికి ఆలోచించి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ స్వయంగా ముంపు గ్రామాల్లో పర్యటిస్తూ వారి యొక్క క్షేమాలను ఆరా తీయడంపై గ్రామ ప్రజలు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా వెంటనే వాటర్ ప్యాకెట్లను ప్రతి ఇంటికి అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పశుగ్రాసానికి కొరత లేకుండా అవసరమైన చర్యలను తీసుకోవడం జరిగిందని, పశు గ్రాసాన్ని కూడా అందజేస్తామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంట నరసాపురం ఆర్డీవో దాసిరాజు, యలమంచిలి తహసిల్దార్ పవన్ కుమార్, సచివాలయం సిబ్బంది,వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు ఉన్నారు.

# ఎస్ఆర్ఎఫ్ యాప్ రద్దు చేసి జీతాలు పెంచండి



**జీలుగుమిల్లి మేజర్‌న్యూస్:** ఎస్ఆర్ఎఫ్ యాప్‌ను రద్దుచేసి జీతాలు పెంచాలని మినీ సెంటర్ మెయిన్ సెంటర్‌గా చేయాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం తాసిల్దార్ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు నల్ల చీరలు ధరించి జాతీయ రహదారిపై రాస్తారోకో చేసి స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ఉదయ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయాలని గ్రేడ్యూటీ జీవోలో మార్పు చేయాలని 5జి ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం జీతాలు పెంచలేదని 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు జీతాలు పెంచలేదని పని భారాలు మాత్రం పెరుగుతున్నాయి అన్నారు. 42 రోజులు సమ్మె సందర్భంగా జీతాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని జీతాలు పెంచలేదని ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి సంవత్సరం కాలము అయినా జీతాలు పెంచకపోవడం దారుణమని పేర్కొన్నారు. మాతృ వందనం అనే కొత్త యాప్‌కు 5జి ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చిట్టి బొమ్మ కొండలరావు, కో కన్వీనర్ ఊర్ల నాగమణి, టీ ఎస్తేరు, పి స్వర్ణ, వెంకాయమ్మ, జ్యోతి, అరుణ, తదితరులు అంగన్వాడీలు పాల్గొన్నారు

# శ్రీ వెంకటరమణ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం





**– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**తాడేపల్లిగూడెంమేజర్ న్యూస్:** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం తాడేపల్లిగూడెం మండలం అలంపురంలోని శ్రీ వెంకటరమణ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హాస్పిటల్‌ను సందర్శించి,హాస్పిటల్ ద్వారా రోగులకు అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్లో వివిధ విభాగాలను, వైద్య పరికరాలను పరిశీలించి ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అనంతరం రోగులకు పళ్ళు పంపిణీ చేయడంతో పాటు, దివ్యాంగులు ప్రేమతో అందించిన గులాబీ పువ్వులను ఆప్యాయతతో పలకరిస్తూ తీసుకొని చిన్నారులను సంతోషపరిచారు. తొలుత జాతీయ రహదారికి ఆనుకుని ట్రస్ట్ నూతనంగా నిర్మించనున్న హాస్పిటల్ కొరకు కొనుగోలు చేసిన నాలుగు ఎకరాల విస్తీర్ణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ శ్రీ వెంకటరమణ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఇంత పెద్ద ఎత్తున ఉచిత హాస్పిటల్ ను నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు. చికిత్సకు ఇక్కడికి వచ్చిన ప్రజలను చూస్తేనే ట్రస్ట్ సేవలు ఎలా ఉన్నాయో అర్థం అవుతుందన్నారు.వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది ప్రజలకు వివిధ సేవలను అందించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ట్రస్టు నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు ప్రజలకు మరింత సేవలందించేందుకు చక్కటి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంలో శ్రీ వెంకటరమణ సేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఉచిత హాస్పిటల్ నిర్వాహకులు కొలనువాడ పెద్ద కృష్ణంరాజు,వారి కుమారుడు కె.వి.రాజు, తాడేపల్లిగూడెం ఆర్డిఓ ఖతీబ్ కౌసర్ భానో, తహసిల్దార్ టి.రాజేశ్వరి, తదితరులు ఉన్నారు.

# ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించండి

**జిల్లా పరిషత్ సీఈవో ఎమ్.శ్రీహరి**



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** మండలంలోని రాచన్నగూడెం గ్రామ పంచాయతీని జిల్లా పరిషత్ సీఈఓ ఎం శ్రీహరి సందర్శించించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లప్ మిత్రాలు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చెయ్యాలని ఆదేశించారు. అలాగే ఐ.వి.ఆర్.ఎస్ ఫీడ్‌బ్యాక్ పనితీరును సమీక్షించారు. గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ కార్యకలాపాలను పరిశీలించారు. గ్రామ ప్రజలతో మట్లాడి క్లాప్ మిత్రుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న అన్ని ఇళ్లను కవర్ చేయాలని ఆదేశించారు. గ్రామస్థులలో ఐవిఆర్‌యస్ కాల్స్‌కి స్పందించేలా మరింత అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి మండల అభివృద్ధి అధికారి నిఖిల్ మధు శరన్, పంచాయతీ కార్యదర్శి గిరిజ, డిపిఆర్‌సిఎఫ్‌టిసి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# వరద బాధితులకు కూరగాయల పంపిణీ





**కుకునూర్, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని గో మ్ముగూడెం లచ్చిగూడెం వెల్లూరుపాడు మండలంలోని రేపు గోమ్ము గ్రామాలను దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి కావలసిన మంచినీటి సౌకర్యం పారిశుధ్యం విద్యుత్ వైద్యం భోజనం మొదలైన సదుపాయాలన్నీ ఏర్పాటు చేస్తున్నారు అందులో భాగంగా గురువారం నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ దాత్రి రెడ్డి వరద ముంపు గ్రామాలన్నీ పర్యటించి వారికి కావలసిన సదుపాయాలన్నీ కూడా పరిశీలించారు అనంతరం వరద బాధితులకు కొవ్వొత్తులు కూరగాయలు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద ముంపు గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి అవసరం వచ్చిన అధికారులు ఆదుకోవటానికి సిద్ధంగా ఉన్నారని అలాగే వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కూడా అధికారులు గత రెండు రోజుల నుంచి ఏర్పాటు చేశారని ఇంకా మరి ఏవైనా అవసరాలు ఉన్నప్పటికీ మా దృష్టికి తీసుకొచ్చినట్లయితే వాటిని పరిష్కరించడానికి అధికారులు అందరం కృషి చేస్తామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శ్రీహరి తాసిల్దార్ రమేష్‌బాబుఎంపీడీవో నరసింహారావు ఏ ఈ వీరస్వామి పంచాయతీ కార్యదర్శులు రమేష్ శ్రీరామచంద్రమూర్తి వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు

# ఒకేషనల్ శిక్షణా తరగతులు

**పరిశీలించిన విద్యాశాఖ అధికారులు**
**కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ చంద్రశేఖర్**



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించబడుతున్న ఒకేషనల్ శిక్షణ తరగతులను పశ్చిమగోదావరి జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ చంద్రశేఖర్ మండల విద్యాశాఖ అధికారి 2 శ్రీమతి పిఎంవికే జ్యోతి ఒకేషనల్ శిక్షణా తరగతులను, ల్యాబ్ ను, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రికార్డ్స్ పరిశీలించి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ శిక్షణ ఉపాధ్యాయులు సురేష్, మాధవి, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, సి ఆర్ పి నాని బాబు తదితరులు పాల్గొన్నారు.

# జిన్నూరు సొసైటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం





**పోడూరు,మేజర్‌న్యూస్:** మండలంలో జిన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రమాణస్వీకారం గురువారం జరిగింది,చైర్ పర్సన్‌గా దేవళ్ళ ప్రసాదు,పర్సన్స్‌గా దొమ్మేటి రాంప్రసాద్,చొప్పళ్ళ రాజమణి ప్రమాణ స్వీకారోత్సవం చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు, పాలకొల్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాముల రజిని కుమార్ హాజరయ్యారు, ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలు, పాడి పశువులు వ్యవసాయ పరికరాల వంటి ఎన్నో రుణాలు పొందవచ్చునని, బయట బ్యాంకుల కన్నా ఎక్కువ రుణాలు పొందే అవకాశం ఈ సొసైటీలు ద్వారా పొందొచ్చని, తక్కువ వడ్డీలు రాయితీలు పొందవచ్చు అన్నారు, పాముల రజిని కుమార్ మాట్లాడుతూ జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ప్రతి సొసైటీలోనూ ఆయన నియోజకవర్గంలో మంచి వ్యక్తులను నియమించి అభివృద్ధి పదంలో నడిపించే విధంగా ఏకగ్రీవాలు జరిగాయన్నారు, ఈకార్యక్రమంలో గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, పాలవలస తులసీ రావు, దాసరి రత్నం రాజు, రుద్రరాజు సత్యనారాయణ రాజు, రాంబద్ర రాజు,గండేటి వెంకటేశ్వరరావు, పాలకొల్లు నీటి సంఘం అధ్యక్షులు పులకండం రాఘవ, తదితరులు పాల్గొన్నారు,

## కేంద్ర రోడ్డు రవాణా కార్యదర్శితో కేంద్ర మంత్రి వర్మ ,పితాని భేటీ



**ఢిల్లీ / భీమవరం,మేజర్ న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లాలో కీలక జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వశిష్ట గోదావరిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంపై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రత్యేక దృష్టి సారించారు. ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఉమా శంకర్ ను గురువారం ఆయన కలిసి చర్చించారు. ఆచంట నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన వశిష్ట గోదావరి నది పైన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, ఎన్‌హెచ్ 216 ఆకివీడు -దిగమర్రు రహదారి పనులు త్వరితగతిన ప్రారంభించాలని, అలాగే నిలిచిపోయిన ఎన్‌హెచ్ 165 నరసాపురం బైపాస్ పనులు వేగవంతం చేయాలని శ్రీనివాస వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కూడా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే సత్యనారాయణలు కార్యదర్శి ఉమా శంకర్‌ను శాలువాతో సత్కరించారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ విజ్ఞప్తిపై కార్యదర్శి ఉమాశంకర్ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బ్రిడ్జి నిర్మాణం కోసం సంప్రదించి పూర్తి సహకారం అందిస్తామని కార్యదర్శి ఉమా శంకర్ హామీ ఇచ్చారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి



ఏలూరు,మేజర్ న్యూస్: ఒంగోలులో ఈ నెల ఈనెల 23 నుండి 25వ తేదీ వరకు జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు వరక శ్యామల ,మన్నవ యామిని పిలుపు ఇచ్చారు.గురువారం ఉదయం స్థానిక కార్యాలయం నందు వారు మాట్లాడుతూ సమాజంలో శ్రామికులు ,పేద ,బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, ప్రత్యేకించి మహిళలకు సమాన అవకాశాల కోసం పోరాడే కమ్యూనిస్టు పార్టీ ప్రతి మూడేళ్లకు ఒకసారి సంస్థాగత పార్టీ మహాసభలు వహిస్తూ ఉంటారని తెలిపారు.అ మహాసభల ప్రారంభం రోజు అయిన 23వ తేదీన ఒంగోలు నగరంలో వేలాదిమందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతున్నదని అన్నారు. ఈ ప్రదర్శన సభలలో ఎర్ర చీరలు ధరించిన మహిళలు,యువ కమ్యూనిస్టు జనసేవ దళ కార్యకర్తలతో భారీ కవాతు ఉంటుంది అన్నారు.

# డిఆర్ఓ వెంకటేశ్వర్లుకి కన్ఫర్డ్ ఐఏఎస్‌గా ప్రమోషన్ పట్ల హర్షం

**రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా,**
**రాష్ట్ర అధ్యక్షులు రవీంద్ర రాజు శుభాకాంక్షలు**



**పెనుమంట్ర, మేజర్‌న్యూస్ :**పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు కి కన్ఫర్డ్ ఐఏఎస్ గా ప్రమోషన్ వచ్చినందుకు, వారి చాంబర్లో పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. జిల్లా ,రాష్ట్ర అధ్యక్షులు. భూపతిరాజు రవీంద్ర రాజు శుభాకాంక్షలు తెలియజేసారు, ఈ సందర్భంగా జిల్లా ,రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు మాట్లాడుతూ వివిధ హోదాలో మంచి గుర్తింపు తెచ్చుకుని పనిచేస్తూ మాకు కృష్ణాజిల్లాలో జిల్లా రెవిన్యూ అధికారిగా అప్పట్లో మాకు విఆర్ఓ నుండి సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించడంలో కృష్ణాజిల్లాలో ఎంతో కృషి చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు జిల్లా రెవిన్యూ అధికారిగా పనిచేసినప్పుడు కూడా మా వీఆర్వోలుకు ప్రమోషన్లు విషయంలో కూడా కృషి చేయడం జరిగింది. అటువంటి మహోన్నత వ్యక్తి పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లా రెవిన్యూ అధికారిగా పనిచేస్తున్న సమయంలో జాయింట్ కలెక్టర్ గా ప్రమోషన్ రావడం మాకు ఎంతో సంతోషకరమైన విషయము. మరలా పశ్చిమగోదావరి జిల్లాకి అవకాశం వచ్చినప్పుడు జిల్లా జాయింట్ కలెక్టర్ గా రావాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జకరయ్య, భీమవరం మండల విఆర్వోల అధ్యక్షులు రతన్ రాజు, విఆర్ఓలు జయ బాబు, మోహన్, వనిత, దుర్గ భవాని పాల్గొన్నారు.

## కృష్ణ బలిజ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా త్రిమూర్తులు ప్రమాణం



**భీమవరం,మేజర్ న్యూస్:** ఏపీ కృష్ణ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా గంటా త్రిమూర్తులు (భీమవరం టీడీపీ సీనియర్ నాయకులు) విజయవాడలోని గొల్లపూడి బీసీ సంక్షేమ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ అధికారి జేఎండి ఉమాదేవి ఆధ్వర్యంలో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎవరైనా సరే పార్టీకి అంకితభావంతో కష్టపడి పని చేస్తే అందరికీ పార్టీలో ఎంతో గుర్తింపు ఉంటుందని, పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని త్రిమూర్తులు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని, రానున్న కాలంలో ఆయన పాలన మరింత అద్భుతంగా ఉంటుందని, ప్రజలు ఎంతో ఆనందకరమైన జీవితాన్ని అనుభవిస్తారన్నారు. తనకు ఈ చైర్మన్ పదవి రావడానికి సిఫార్సు చేసిన తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ,జిల్లా పార్టీ అధ్యక్షుడు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దుల రాము,చల్ల బోయిన గోవింద్, యలమంచిలి శ్రీను, మరపట్ల శ్యాంబాబు, కాపా అమర్ బాబు, వినాయక్, తోట వెంకటేశ్వరరావు, గొలగాని దుర్గారావు, అన్నం నాంచారయ్య, జే రాజు, జే దుర్గ, నేదునూరి గంగాధర్ తిలక్, మద్దుల సాయి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామి వారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భముగా శ్రీ స్వామి వారి ఆలయంలో ఉదయం 9 గంటలకు సుమారు 1500 మంది భక్తులతో ఉచిత వరలక్ష్మీ వ్రతాలు వేద పండితులచే. పురోహితులచే, నిర్వహించబడునని ఈవో ముచ్చర్ల శ్రీనివాస్ తెలిపారు, ఐ న్యూస్ రిపోర్టర్ కునపురెడ్డి శ్రీనివాస్ దంపతులను వేద పండితులు ఆలయ సిబ్బంది, గురువారం లీల కళ్యాణం సందర్భంగా ఆశీర్వదించి శాలువాతో సత్కరించారు.

# ఆరోగ్యమే మహా భాగ్యం



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఆరోగ్యవంతమైన శరీరంలో ఆరోగ్యవంతమైన మెదడు ఉంటుందని పెద్దలు సూచించారని,మన శరీరాన్ని ఎంత ఆరోగ్యంగా ఉంచుకోగలిగితే విధి నిర్వహణలో అంత సమర్థవంతంగా పనిచేయగలరని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ పి మెర్సీ అన్నారు. స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో జువాలజీ విభాగం వారు,ఆశ్రం హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపులో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సిస్టర్ పి.మెర్సీ ప్రసంగించారు. కళాశాల పిజి డైరెక్టర్,కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సిస్టర్ సుశీల మాట్లాడుతూ తరం విద్యార్థులు,ఉద్యోగులకు,కంప్యూటర్ల వినియోగం ఎక్కువైనందున వచ్చే కంటి సమస్యలపై అవగాహన కలిగించడానికి కంటి వైద్య శిబిరం కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జువాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆర్ ఇందిర,అధ్యాపకులు డాక్టర్ కె ఎస్ వి కె ఎస్ మాధవిరాణి, డాక్టర్ ఎస్ ప్రతిమాకుమారి,ఎన్ లక్ష్మీ ప్రసన్నలు పాల్గొన్నారు. మారు 100 మంది సిబ్బంది, 500 మంది విద్యార్థులు ఈ ఉచిత వైద్య శిబిరం సేవలను వినియోగించుకున్నారు.

# సెయింట్ జోసెఫ్ మానసిక వికలాంగుల వసతి గృహంలో అన్నదానం



**- ముఖ్య అతిధులుగా రెడ్డి అప్పల నాయుడు,నారా శేషు**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు ఏలూరులో చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.అభిమానులు సేవా స్ఫూర్తిని ప్రధానంగా తీసుకుని గత వారంరోజులుగా విభిన్న సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.. సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం 7వ రోజు సోమవరప్పాడులో ఉన్న సెయింట్ జోసెఫ్ మానసిక వికలాంగుల వసతి గృహంలో పిల్లలకు భోజనం మరియు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు జనసేన నాయకులు నారా శేషు హాజరయ్యారు. తొలుత అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.మెగా అభిమాని రామిశెట్టి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని తలపెట్టడం జరిగింది.ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ "మెగాస్టార్ చిరంజీవి ఎంతోమందికి స్ఫూర్తి ప్రదాత. ఆయన చూపిన సేవా మార్గంలో అభిమానులు నడుస్తుండటం సమాజానికి ఆదర్శప్రాయం. రక్తదానం, వైద్య శిబిరం,అన్నదానం వంటి కార్యక్రమాలు చిరంజీవి సేవా తత్వాన్ని ప్రతిబింబిస్తాయి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు చిరంజీవి యువత అధ్యక్షులు శానం రామకృష్ణ మూర్తి, మారం హనుమంతరావు (అను),ఈదుపల్లి పవన్, పి.జగన్, దేవరపల్లి పెదబాబు,కట్టా ఆది, సురేష్ మాస్టర్,నరేష్, దేవా బత్తుల అరవింద్, రామిశెట్టి కళ్యాణ్, పండు నాయుడు,తుంపాల ఫణి, కోమాకుల శ్రీను, కరణం లోకేష్,లొట్టు రమేష్, రామ్ లక్ష్మణ్,డి.రాజు,శానం ఉదయ్ సాయి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు. ఏలూరులో మెగా అభిమానులు చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలు విశేషంగా చర్చనీయాంశమయ్యాయి.

# ఐజి అశోక్ కుమార్‌తో గణేష్ ఉత్సవ సమితి భేటీ



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్‌ని కలిసి ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి జిల్లా శాఖ అధ్యక్షులు నారా శేషు,రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్ లునాని వారికి సింగిల్ విండో విధానం గురించి తెలియజేసి చర్చించారు. గవర్నమెంట్ సింగల్ విండో యాప్ రిలీజ్ చేసిన విషయం ఐజి చెప్పి సమస్యలన్నీ శ్రద్ధగా విని తగు సలహాలు సూచనలను తెలిపారు.

# సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి





**ఏలూరు,మేజర్‌న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర 28వ మహాసభల సందర్భంగా ఈనెల 23 శనివారం ఒంగోలులో జరుగుతున్న మహా ప్రదర్శన ,బహిరంగ సభకు ఏలూరు జిల్లా నుండి సిపిఐ, బికేఎంయు శ్రేణులు తరలి వెళ్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బికేఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సిపిఐ శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో పార్టీ రాష్ట్ర మహాసభలు ఒంగోలు నగరంలో ఆగస్టు 23 నుండి 25 వరకు జరుగుతున్నాయని వారు తెలిపారు. మహాసభల ప్రారంభ సందర్భంగా 23వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఒంగోలు నగరంలో నెల్లూరు బస్ స్టాప్ నుండి మహా ప్రదర్శన జరుగుతుందని అనంతరం అద్దంకి బస్టాప్ వద్ద బహిరంగ సభ జరుగుతుందని వారు తెలిపారు. ఆగస్టు 24, 25 తేదీలలో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు.జిల్లా నుండి ప్రతినిధుల సభకు పార్టీ సభ్యత్వం ప్రాతిపదిక మీద,రాష్ట్రస్థాయి ప్రజాసంఘాలకు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న వారితో కలిపి 25 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని కృష్ణ చైతన్య, వెంకటేశ్వరరావు తెలిపారు.



# ఆల్ ఇండియా ర్యాంక్ సాధించిన గణేష్‌కు కొవ్వలి ఫౌండేషన్ అభినందనలు

**నరసాపురం,మేజర్ న్యూస్ :** పట్టణం లోని 26 వ వార్డు తులసీనగర్‌లో నివాసం ఉంటున్న డేగల గణేష్ మంగళ వారం విడుదలైన పి జి నీట్ ఎగ్జామ్ లో ఆల్ ఇండియా 1500వ ర్యాంక్ సాధించారు. ఎలమంచిలి మండలం వైవి లంకకు చెందిన డేగల రాంబాబు కుమారుడుడాక్టర్ డేగల గణేష్ ను గురువారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు వ్యక్తిగత కార్యదర్శి సంకు భాస్కర నాయుడు ఆయన స్వగృహంలోకలసి పూలమాల, సాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వలి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. మరింతఉన్నతశిఖరాలకు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# మతాల పేరుతో దాడులు హేయం


**- ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ అధినేత డాక్టర్ జీవన్ కుమార్**





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** మతాల పేరుతో దాడులు హేయం అని, అన్ని మతాల నాయకులు ఇతర మతాలను విమర్శించకుండా సమాజంలో మంచి చేయడానికి దోహదపడాలని క్రీస్తు ప్రేమ బోధనలు చెడు మార్గంలో ఉన్న వారిని సన్మార్గంలోకి నడిపిస్తాయని ఆలిండియా పాస్టర్ ఫెడరేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ జీవన్ కుమార్ అన్నారు. గురువారం సత్రంపాడు గచ్చ మనే సెంట్రల్ చర్చ్‌లో ఏలూరు సిటీ పాస్టర్స్ ఫెడరేషన్ దైవ సేవకుల సమావేశం జరిగింది. బిషప్ కారుపాటి శాంతి సాగర్ మాట్లాడుతూ ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శనీయమని వారి సేవలు విశ్వవ్యాప్తం కావాలని ఆకాంక్షించారు.ఆల్ ఇండియా పాస్టర్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ జి సుభద్రరావు కిరణ్ పాల్ పి పి ఎస్ కిరణ్ పాల్ జిల్లా అధ్యక్షులు చిక్కాల కార్యదర్శి మహేష్ ట్రెజరర్ జేమ్స్ విజయ్ కుమార్,సిటీ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు గ్రేస్ జాన్ జాయింట్ సెక్రటరీ రూబేను ఏలూరు జిల్లా మండలాల నాయకులు సేవకులు సమావేశంలో పాల్గొన్నారు.

# సంఘ సేవకులు తల్లాప్రగడ సుబ్బారావు మృతి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** నగరానికి చెందిన సంఘ సేవకులు, కళాభిమాని, హిందూ యువజన సంఘం(వైయం. హెచ్ఎ.) సభ్యుడు ,రొటేరియన్ తల్లాప్రగడ సుబ్బారావు(79) పవర్ పేటలోని ఆయన నివాసంలో గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు ఇరువురు కుమారులు ఉన్నారు. ఏలూరు నగరంలో సేవా, ఆధ్యాత్మిక, కళ సంస్థలలో సభ్యుడిగా కొనసాగుతూ అవినాభావ సంబంధం కలిగి కళారంగానికి సమాజానికి సమాజంలో ప్రజలకు అనేక సేవలందించారు. సుబ్బారావు గారు. అలానే పట్టణంలోని పూర్వపు వెంకటేశ్వర సినిమా థియేటర్ యజమానిగా సినీ రంగ నిర్మాత దర్శకులు,నటులచే స్నేహపూర్వక పరిచయాలు కలిగిన సినిమా థియేటర్ యజమానిగా, ఏలూరుకు చెందిన వ్యక్తిగా కీర్తి గడించారు. తల్లాప్రగడ సుబ్బారావు ఆకస్మిక మృతికి హిందూ యువజన సంఘం( వైఎంహెచ్ఏ) మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు,ప్రధానకార్యదర్శికెవిసత్యనారాయణ, కోశాధికారి కానాలబాల వెంకట రమేష్ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఇరదల ముద్దుకృష్ణ ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావు కోశాధికారి గాదంశెట్టి శ్రీనివాసరావు ,సభ్యులు నగరానికి చెందిన సేవా సంస్థల నిర్వాహకులు తల్లాప్రగడ సుబ్బారావు మృతికి సంతాపాన్ని తెలియజేశారు.వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

# వరద బాధితులకు పూర్తిస్థాయిలో సహాయం అందించాలి : జేసి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో సహాయ కార్యక్రమాలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. వరద ముంపు ప్రాంతాలైన కుక్కునూరు మండలం లచ్చిగూడెం, కాకిస్నూర్ గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల ప్రజల సమస్యలను జేసీ అడిగితెలుసుకున్నారు. వారికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ వరద ప్రమాదం పూర్తిగా తొలగే వరకు వరద ముంపు గ్రామాల ప్రజలను వరద సహాయక కేంద్రాల లోనే ఉంచాలని, వారికి భోజన, వసతి సదుపాయాలు చూడాలన్నారు. సహాయక కేంద్రంలో వైద్య కేంద్రం ఏర్పాటుచేసి, అక్కడ ప్రజలకు వైద్యసేవలందించాలన్నారు. అందుకు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వరద సహాయక కేంద్రంలో ఉంటున్న ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, కేంద్రాలకు అవసరమైన బియ్యం, వంట సామాగ్రి, కాయగూరలు పూర్తిస్థాయిలో అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వరద సహాయ కేంద్రంలో భోజన తయారీ, వైద్య కేంద్రం నిర్వహణ, అందుబాటులో ఉన్న మందులను జేసీ పరిశీలించారు.జాయింట్ కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, రెవిన్యూ, పంచాయతీరాజ్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రారంభమైన రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్ పోటీలు







**పెంటపాడు,మేజర్‌న్యూస్ :** పెంటపాడు మండలం, ప్రతిపాడులోని సరస్వతి విద్యాలయంలో 6వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ 2025 పోటీలు ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగినాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ గౌరవాధ్యక్షులు యోగ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రవీంద్రనాథ్, యోగ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ రాధిక, యోగ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రెసిడెంట్, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఆరోగ్యశ్రీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ పల్లవి, గట్టిం మాణిక్యాలరావు పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 316జి, డాక్టర్ కొలనువాడ పెద్ద కృష్ణంరాజు వెంకటరమణ సేవ చారిటబుల్ ట్రస్ట్ అలంపురం ఫౌండర్, కరిబండి రామకృష్ణ ఇంటర్నేషనల్ యోగ కోచ్ మాట్లాడినారు. అనంతరం జెండాఊపి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆరా ఫౌండేషన్ సభ్యులు వచ్చిన వారికి సేవలు అందించి కార్యక్రమాలను పర్యవేక్షించారు.అపర్ణ ప్రసాద్, ఎల్ఐసి త్రిమూర్తి, బోగవిల్లి రాజా, కృష్ణ, నున్నా నాగేశ్వరరావు, నున్నా రాంబాబు, సుజాత సుభద్ర మహాలక్ష్మి తదితర యోగ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుండి ఈ కార్యక్రమంలో పార్టిసిపేషన్ చేయడానికి అథ్లెక్స్,కోచ్‌లు, జడ్జిలు వచ్చినారు.దీనిలో విజయం సాధించిన వాళ్ళందరూ నేషనల్‌కు అక్కడ విజయం సాధించినవారుఇంటర్నేషనల్‌కు వెళతారని అన్నారు.కొలనువాడ పెద్ద కృష్ణంరాజు మాట్లాడుతూ నేను నా స్వయం అనుభవంతో యోగా ద్వారా నా అనారోగ్య సమస్యలను తగ్గించుకున్నానని వివరించారు. ప్రెసిడెంట్ రాధిక మాట్లాడుతూ ఈ పోటీలో యోగాసనాలు మాత్రమే పరిగణలోకి తీసుకోకుండా పార్టిసిపేషన్స్ ప్రవర్తన కూడా గమనిస్తారని చిన్న చిన్న తేడాలతో విన్నర్స్ డిసైడ్ అవుతారని కావున ప్రతి ఒక్కరూ స్పోర్ట్స్ అథారిటీ ఏర్పర్చిన కోడ్ ఆఫ్ బుక్ ప్రకారం యోగాసనాలు చేయాలని సూచించారు.కరిబండి రామకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సేవలుఅందించిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు.


# విద్యార్థులకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేత

### – జనసేన నాయకులు శొంఠి రామకృష్ణ వితరణ

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** జీలుగుమిల్లి మండలం కనకాపురం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారుల ఆరోగ్యం దృష్ట్యా శుభ్రమైన తాగునీరు అందేలా వాటర్ పూరీఫైయర్ ను జనసేన పార్టీ నాయకులు శొంఠి రామకృష్ణ అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము. ఈ సందర్భంగా శొంఠి రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడం చాలా ముఖ్యం అన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో నీటి ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక సదుపాయాలు మెరుగుపరచడం పట్ల జనసేన ఎప్పుడూ కృషి చేస్తుందని ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో



జనసేన నాయకులు జీలుగుల శివ, మండల ఉపాధ్యక్షులు కొప్పుల శ్రీకాంత్, సరియం ముత్యాలరావు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## రాజగోపాల స్వామి ఆలయ కమిటీ నియామకం

**నరసాపురం,మేజర్‌న్యూస్:** పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ రాజగోపాల స్వామి గుడి చైర్మన్ గా రామవరపు శ్రీరామ్ నియమితులయ్యారు. ఆయనతో పాటు డైరెక్టర్ల ను నియమించారు. గురువారం ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నాయకర్ శుభాకాంక్షలు తెలియజేశారు

# బంగారు గొలుసు దొంగ అరెస్టు, రిమాండ్

### వాహనాల తనిఖీల్లో ముద్దాయి పారిపోయే ప్రయత్నంలో పట్టుకున్న పోలీసులు




**కైకలూరు,మేజర్‌న్యూస్:** కైకలూరు నుండి కోరుకొల్లు వెళ్లే రోడ్డులో బోడావుల గంగా మహాలక్ష్మి (భర్త) పాండురంగారావు, 70 సంవత్సరాలు వయసు గల వృద్ధురాలి మెడలో బంగారు నాను తాడు అపహరించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.సుమారు 30 సంవత్సరాలు వయస్సు గల యువకుడు వెనక నుండి బలవంతంగా లాక్కుపోయిన సంఘటనలో జిల్లా ఎస్పి కె ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో , కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ పి. కృష్ణ ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందం సభ్యులు ఎస్సై ఆర్.శ్రీను,వారి సిబ్బంది. దుర్గాప్రసాద్, నాగార్జున, రాము బోడావుల గంగా మహాలక్ష్మి ఇచ్చిన రిపోర్ట్ పై టౌన్ పోలీస్ కేసు సిఆర్. నెంబర్ 82/2025 యు /ఎస్ 307, 317(2) బిఎన్ఎస్ నమోదు చేసి దర్యాప్తులో భాగంగా గురువారం ఇన్స్పెక్టర్ పి.కృష్ణ ఆదేశాలపై ఎస్సై శ్రీనివాస్ వారి సిబ్బందితో కలిసి కైకలూరు గ్రామం లో కోరుకోల్లు రోడ్డులో ఆచవరం రైల్వే గేటు, దగ్గర వాహన తనిఖీలు చేయుచుండగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.ఒక వ్యక్తి బ్లాక్ స్పెండర్ ప్లస్ బైక్ ఏపీ 39 ఎన్ ఎన్ 8678. బైక్ మీద పారి పోవటానికి ప్రత్నించిన వ్యక్తిని విచారించగా, అతడు కైకలూరు మండలం వేమవరపాడు గ్రామానికి చెందినా బొడ్డు మోజేష్ తండ్రి కృపావరం, సదరు వ్యక్తిని ముద్దాయిగా గుర్తించిన ఎస్సై శ్రీనివాస్ అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 3కాసుల బంగారు నాను తాడు, నేరం చేయటానికి ఉపయోగించిన బ్లాక్ బైక్‌ను స్వాధీన పరుచుకున్నారు. ముద్దాయి నీ కోర్టు వారు ఎదుట హాజరపరచడం అయినది. ఈ కేసు దర్యాప్తునకు కృషి చేసిన ఎస్సై,వారి సిబ్బందిని డీఎస్పీ శ్రావణ్ కుమార్ అభినందించారు.

## నూతన బిర్యానీ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ : జీలుగుమిల్లిలోని పాత సినిమా హాల్ సెంటర్ వద్ద శర్మ కాంప్లెక్స్ లో బిస్మిల్లా నూతన బిర్యాని సెంటర్ ను పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు,జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన బిస్మిల్లా బిర్యానీ సెంటర్ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. యువత ప్రభుత్వ ఉద్యోగం పై ఆధారపడకుండా సొంత వ్యాపారంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు రావడం ఎంతో ఆనందకరమని అన్నారు. ఇలాంటి చిన్నతరహా వ్యాపారాలు స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన ఆహారం అందించాలని ఉద్దేశంతో గ్రామీణ ప్రాం తాల్లో ప్రారంభమవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. తొలి బిరియాని ప్యాకెట్ ను ఎమ్మెల్యే బాలరాజు కొనుగోలు చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రెసిడెంట్ పసుపులేటి రాము,జనసేన సీనియర్ నాయకులు చిర్రి శ్రీను, రాధాకృష్ణరాజు, జానకిరామరాజు, డేవిడ్ రాజు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# జనసేన కార్యాలయంలో రవీంద్ర పుట్టినరోజు వేడుక

### అతిథిగా హాజరైన విప్ నాయకర్



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల సహాయ కార్యదర్శి బందెల రవీంద్ర పుట్టినరోజు వేడుక స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వవిప్ బొమ్మిడి నాయకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధి కోసం, సిద్ధాంతానికి కట్టుబడి, క్రమశిక్షణతో పనిచేస్తున్న రవీంద్ర పుట్టినరోజు వేడుక పార్టీ కార్యాలయంలో జరుపుకోవడం శుభ పరిణామం అన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని, రవీంద్ర ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలా వసంతరావు, యోగా గురువు జక్కం బాబ్జి, జడ్డు మల్లికార్జున రావు, వలవల నాని, పోలిశెట్టి సాంబ, అకేనా చంద్రశేఖర్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.